# బోల్తా

పార్టీ లీడరు అందునా భిషక్మణి, సంఘసేవికా చెప్పిన మాటలకు పార్టీ సభ్యుడు బోల్తా పడ్డాడు. పార్టీ చీఫ్ తన తల మీద పూలు టోపీ కిందికి లాగుతూ మెడవరకూ, బుజాలవరకూ లాగిందని తెలుసుకోలేకపోయాడు సభ్యుడు. పార్టీ వ్యతిరేక చర్యలు చేయలేదని లీడరు తనను మెచ్చుకుంటే బోల్తా పడ్డాడు పార్టీ సభ్యుడు.

ఇంతవరకు నువ్వు పార్టీకోసం త్యాగమూ చేశావు, బాగా శ్రమించి సభ్యులనూ చేర్చావు, పార్టీయే నావారనుకున్నావు. బంధు ప్రీతి చూపలేదు. యూ అర్ ఆనెస్ట్ కామ్రేడ్, ఇప్పుడేం చేయాలంటే పార్టీ పటిష్టం చేయాలి. ఈ అమ్మాయి మన పార్టీ వర్కరు. ఈ అమ్మాయికెవరూ లేరు. పార్ట్నర్ ప్రమాదవశాత్తూ పోయాడు. నన్నాశ్రయిస్తే, మన పార్టీ మానిఫెస్టో చెప్పి, మన పార్టీ మెంబర్ని చేశాను. నా దగ్గరే వుండమన్నా. బాగా శ్రమిస్తుంది. నేను పరాయి వూళ్ళకీ, పల్లెలకీ సోషల్వర్క్ చేస్తూ కూలీల ఫామిలీలకి వైద్యం చేయటానికి వెళ్ళి పదిరోజులుండాల్సి వస్తే, యిది యిక్కడ ఒంటరి దౌతున్నది. నువ్వు దీనిని మన పార్టీ పద్ధతుల మీద పెళ్ళాడాలి. అన్ని ఖర్చులూ పార్టీయే పెట్టుకుంటుంది. అంతేకాదు ప్రహ్లాద్ ఆమె బాధ్యతలన్నీ పార్టీవే. భర్త అనే వాడుంటే రక్షణ వుంటుం దని చెప్తున్నాను. ఫామిలీ యేర్పడినా తర్వాతి బాధ్యతలూ పార్టీవే. నా దగ్గరే వుంటుంది అని పనస చదివిం .

అదేదో తీసి సరుకు యెదురుగా బల్ల మీద పెట్టినట్టున్నది ప్రహ్లాద్‌కి, బరువూ బాదరబందీ లేని గృహస్తుకి యే ప్రమాదం వుండదు అనిపించి తలూపేశాడు పార్టీకోసమే.

సభ్యుని పూర్వచరిత్ర కుతూహలంగా వుంటుంది. పెద్దింటి బిడ్డా, హైక్లాస్. ఉన్నత పాఠశాల వదలకముందే నిషేధసాహిత్యం సంపాయించి యింటికి తెచ్చి చదివేవాడు. సాహిత్యం విలువైనదిగా, అమూల్యమైనదిగా, పనికివచ్చేదిగా, దేశాన్ని వుద్ధరించేదిగా తోచింది,

అప్పటికింకా భారతమాత దాస్య శృంఖలాలలోనే వున్నది. అరవిందయోగి, నా దేశం, నా భూమి అనే స్లోగన్స్ మాన్పించి 'మాత' 'భారతమాత' అనే స్లోగన్ వ్యాప్తిలోకి తేగా, బంకిం చంద్రుడు వందేమాతరం అనే గీతిక అల్లితే, ఆ గీతిక చాపకింద నీరు లాగా చల్లగా యువతరంలోకి పాకింది. మాత దాస్యశృంఖలాలచే కట్టబడి మగ్గిపోతున్నది. ఆ శృంఖలాలను పగలగొట్టాలని నినాదం నేర్చారు, దేశీయులు. యువతరం ముందుకడుగేసింది.

దాస్య శృంఖలాలు పగలగొట్టటానికి మార్గాలు కనిబెట్టారు యువతరం. సామ్యవాదం, ఉగ్రవాదం. రెండోది మృత్యువుతో పోరాటమే. సాయుధ పోరాటంతోనూ, టెర్రర్ సృష్టించటంతోనూ త్వరగా శృంఖలాలు పగులుతాయని నమ్మకం. సామ్యవాదం యేళ్ళ తరబడి నీళ్ళుగారుతూ గమ్యం చేరలేదని ఉగ్రవాదుల వాదన. ఉగ్రవాదులలో ఉద్రేకులు పుట్టి చీలిపోయారు. నిషిద్ధ

సాహిత్యం చదివితే అడ్డదోవలు కనబడతాయని 'అమ్మ' 'దాస్ కాపిటల్' రహస్యంగా అందించారు. మతమనేది లేదు. పార్టీయే మతం. పార్టీయే బంధువు. దాన్ని నమ్ముకుంటే మాత శృంఖలాలు పగలగొట్టటం సులభం. అదే అసలు మతం.

సభ్యుడెంతగా తన్మయుడయాడంటే, భక్తి నాలుగో పాదం పేరు లయ, ప్రహ్లాదుడు అడుగడ్గునకు మాధవా అను సుధా మాధుర్యమున తేలేవాడు అని పోతనామాత్యుడన్నాడు, అలాగా పార్టీ పార్టీ అంటూ తన్మయుడైనాడదే పేరు గల సభ్యుడు. సహాధ్యాయుల నింటికి తెచ్చి, తన సరసన డైనింగ్ టేబిల్ మీద, టేబుల్ మీల్స్ యిప్పించాడు. సత్యం తెలిశాక తండ్రి ఉగ్రనారసింహుడైతే తల్లి హిరణ్యకశిపి అయింది. పొరక అందుకుని ఆయుధం లాగా వాడింది. ఈ ఉపద్రవం చాలనట్లు మరో ఆపద వచ్చింది. నిషిద్ధ సాహిత్యం యింట్లో వుండగానే, రెడ్ హాండెడ్‌గా పట్టుకుని నిరూపించాలని రక్షణశాఖవారూ, కూపీశాఖవారూ వచ్చారు యింటి మీదికి. ఆ దాడిని, సామ్యవాది సోషలిస్టు భ్రాత బైరాగి చిట్కాతో దారి మళ్ళించి తోలేశాడు ఇంటితోనూ, యింటిలోని ఆత్మీయుల తోనూ సంబంధం తెంచేసుకున్నానని లిఖితపూర్వక దస్తావేజు యిప్పించాడు. ప్రమాణం చేయించాడు సభ్యునిచేత. ఆచార పరికారం యిల్లు సోదా చేసినా నిషిద్ధ సాహిత్యం దేవుడి పీటకింద గూడా కనబడక సోదా చేసిన శాకవారు వెళ్ళిపోయారు.

ఒక విధంగా నిరాశ్రయుడైనాడు ప్రహ్లాద్. పార్టీ భక్తుడు.

ప్రహ్లాదుడూ ఒంటరివాడై హింసలనుభవింపాడుగా. హిరణ్యకశిపుడు వాని అనుయాయులూ ఒక పార్టీ. తల్లి సానుభూతి గలదైనా యేమీ చేయలేదు, కన్వర్ట్.

అదుగో అప్పుడు భిషక్మణి చెట్టునీడలేని యెర్రనెండలో నడుస్తున్న యువకుని తెచ్చి, ధైర్య వచనాలు చెప్పింది. యెవరూ లేకపోవటమేమిటి. చాలామందిమి వున్నాము అని చెప్తూ పార్టీ సభ్యుని చేసి తక్కిన భక్తులకు పరిచయం చేసింది. పార్టీ మానిఫెస్టో చెప్పింది. సామూహిక అనే అమూల్యమైన పదం సమిష్టి అనే మంత్రం నేర్పి మాత దాస్య శృంఖలాలు పగులగొట్టే పదునైన ఆయుధాలవే అన్నది. వెనుకాడరాము. ముందంజ వేయాలి.

అఘమేఘాల మీద వెళ్ళి యింటి ముందు నిలబడి,

నేను వైవాహిక జీవితం బిగిన్ చేయబోతున్నాను అని వివరాలు మానిఫెస్టోలాగా చెప్పాడు. ఆత్మీయులు గాక బంధుగులూ అదేదో నినాదం విన్నట్టు కతారు తీర్చి విన్నారు. కొంత మంది నోళ్ళు వెళ్ళబెడితే, కొంతమందికి స్మృతి తప్పితే, కొంత మంది పొగ్గా నరికిన అరటి చెట్లల్లే పడిపోయారు. ఒకాయన నరసింహావతారమెత్తాడు.

అనవసరంగా యీ ఫార్మాలిటీ యెందుకూ? అని వురిమాడు.

పార్టీకి మీరంతా రావాలి, అందుకూ అని చెప్తూ దానిలోని లాభాలు, ఆస్తిపాస్తుల మీదికి దాడి జరగదనటం బాధ్యతలుండ

52648
శ్రీకాకుళం



వనటం, సభ్యుడున్నత పథానికి పోయి అధికారి కావటం, యాంప్లి ఫైయ్యర్ ద్వారా విన్నాక శాంతించాడు.

మతిబోయినట్లు చూస్తూ కాళ్లీడ్చుకుంటూ ఆ పార్టీ యెంత దివ్యంగా వుంటుందో అని వూహిస్తూ వెళ్ళారు.

వేదిక మీద తమతో బంధం తెంచుకున్న సభ్యునీ వాని బైర్డునీ, బల్లిలాగా వున్న దాని చూసి, బార్బారిజం చూపి శర పరంపరలాగా తిట్ల పరంపర విసిరారు.

నేడు భీష్ముని చంపుదు నిన్ను గాదు విడువుమర్జున! అని కృష్ణపరమాత్మ హుమ్మని లేచినట్లు, లేచాడో బార్బారియన్ వృద్ధుడు. భీష్ముడల్లే లీడరున్నది.

సమ్మితి నాలావు నగుబాటు చేయకు. మన్నింపుమని క్రీడి లాగా సభ్యుడు బార్బారియన్ సభ్యుని లాగాడు, మళ్ళా మాని ఫెస్టో లాభాలు వల్లించాడు. సప్పర్ లాస్ట్ సప్పర్‌లాగా తోచింది బార్బారియన్‌కి. బైర్డు పిటీ క్లీనరేమో అని గొణిగాడు.

సభ్యుడు గృహస్థు అయాడు. కడుపు తీపి తెలియాలని కొడుకు పుట్టాడు, పార్టీ వర్కర్ అనుకూలవతే, లీడరు మాట తభాతు చూపలేదు. ప్రామిస్ నిలబెట్టుకున్నది.

సభ్యుడాదమరిచి నిద్రలో వుండగా ఉప్పెనలాగా అంత ర్జాతీయ కలహాలూ, అసూయలూ, యిగోలూ రేగి రేగి, నీవెంత

అంటె నీవెంత అని తలలు అంకించుకున్నట్లు ప్రపంచ సంగ్రామం వచ్చి ప్రపంచాన్ని ముంచాలని చూస్తున్నట్టు వుధృతమైంది.

భారతమాతకు దాస్య శృంఖలాలు వేసినవారు మొదట్లో పళ్ళ బిగువుమీద తామే యెదుర్కొని పోరాడారు. ఉప్పెన భూమిని మింగకుండా చూడాలని ధనమూ, ప్రాణాలూ ఒడ్డారు. కాలనీలన్నీ చేజారిపోసాగాయి. బలము సన్నగిల్లింది. ఆయుధ సంపత్తీ లేదు. మాన్ పవరూ లేదు.

మొదటి ప్రయత్నంగా, మిగిలిన కాలనీలలో జైళ్లల్లో మగ్గుతున్న తిరుగుబాటుదారులకి ఆశ పెట్టారు. అందులోనూ బోధకుడే ఆశ చూపాడు.

"సైన్యంలో చేరి సాయపడితే మేము గెలవగానే మీకు స్వేఛ్ఛ యివ్వటమే గాక, మీ నేరాలన్నీ కొట్టివేసి వుద్యోగాలూ యిస్తాము. సైన్యంలో చేరండి."

ఒక తిరుగుబాటుదారుకి రాజభాష రాదు. బోధకుడు చెప్పింది అర్థం గాలేదు. బాగా చదువుకుని, దుబాసిగా పనిచేసిన పాటి తిరుగుబాటు ఖైదీ నడిగాడు,

"బోధకుడేమని బోధిస్తున్నాడు? మతం మార్చుకోమంటాడా?"

పృచ్ఛకుని మాటలకు దుబాసి ఖైదీ నవ్వాడు.

"అహహహ! మతం పుచ్చుకోమనటం లేదు సోదరా! అది మేలే. సైన్యంలో చేరి గుండుదెబ్బకీ, ఫిరంగికీ బొమ్మా తలా

చూపి వీరమరణం పొందితే స్వర్గమొస్తుందని బోధిస్తున్నాడు బోధకుడు. ఓడుతున్నారు గదూ మనిషి సాయం కావాలి" అన్నాడు గడుగ్గాయి ఖైదీ.

శృంఖలాలు వేసినవాడు విధికి తలఒగ్గాడు. త్రాహి త్రాహి అంటూ, అభివృద్ధి పొంది, భాగ్యశాలి అయిన దేశాన్ని ఆశ్రయిం చాడు. సాయం కావాలన్నాడు.

భాగ్యశాలేమో తక్కువ తినలేదు. రెండాకులెక్కువే చదివాడు. "ఇపుడు గుర్తొచ్చానా?" అని డెంక్చర్ చూపాడు శర్త్ పెట్టాడు తెలివిగా.

"తప్పక సాయపడతాను మిత్రమా, మనం మనం ఒకటి. నువేం చేయాలంటే, యింకా నీ అధీనంలో వున్న కాలనీలోని సంఖ్యాబలంతో పేట్రేగిపోతున్నవారిని గుర్తింపు వచ్చిన పార్టీ వారిని, రహస్యంగా సహాయ సంపత్తి గలవారిని కంటిలో నలుసులాగా అయినవారిని, పానకంలో పుడకల వంటి వారినీ, కలుపు మొక్కలు యేరి పీకేసినట్టు పీకేయాలి జనమేజయ చక్రవర్తి మనవాడే మిత్రమా! సర్పయాగమని మొదలెట్టి, నాగులను పేరు పేరునా పిలుస్తూ హోమ గుండంలో పడేయించాడు మంత్రాల ద్వారానే. నువ్వూ అట్టి మంత్రాంగం నెరపాలి" అని కరాఖండిగా చెప్పాడు.

"అలాగే" నంటూ వాగ్దానమిచ్చాడు ఆశ్రయించినవాడు.

అదుగో అప్పుడు సభ్యుని జీవితం సుడిగుండంలో పడి సుళ్ళు తిరిగింది. కొంతమంది సభ్యులు సొరంగాలో దాక్కుంటూ యీ సభ్యునీ దాచారు. సొరంగ జీవితం యెన్నాళ్ళు కాపాడు తుందీ? ఒకసారన్నా బయట తిరగాలి, సూర్యరశ్మికోసం శరీరం తపించిపోతుంది. సూర్యుడే జీవదాత.

పట్టపగలు గుర్తింపబడి పట్టుబడి తెలియనిచోట వుంచ బడ్డాడు. అన్నం నీళ్ళూ లేవు. నేప్పరులైన పరిచితులు నోరెండిన సభ్యునికి మంచినీళ్ళు స్మగుర్ చేసి అందించారు. కాసిని బిస్కెట్లు పిడికడన్నం రోజుకోసారన్నా జీవుని పొట్టలోకి పోయేట్టు చూశారు. తల్లి కడుపు చల్లగా ప్రాణాలతో మిగిలాడు.

అందుకే స్త్రీలు గర్భిణీలైతే కడుపు చలవ అని చలిమిడి చేసి ఒళ్ళో పెడతారు. సూడిదలిస్తారు. పిల్లలకి తలంటు పోసే ముందు నూనె నెత్తిన పెడుతూ "తల్లి కడుపు చల్లగా" అని దీవన మొదలెడతారు.

రగిలి రగిలి కార్చిచ్చులాగా అయిన యుద్ధజ్వాల యెలాగైతే నేం చల్లబడింది, సంకెళ్ళు వేసినవారు కాలనీలు కోల్పోయినా గెలిచాం అని సంతోషించారు. సలవరింపినట్లు సందట్లో సడా మియాలాగా సంకెలలున్నామె బిడ్డలు పాలకుల మీద దెబ్బతీశారు. తెలివీ బలమూ గలవారంతా పోయారు. ఓపికా లేదు ఉత్సాహమూ లేదు. కన్నులొట్టపోయినట్టున్నాది పాలకుల అవస్థ. పోతే పోయిం దిలే అని కాలనీ వదిలి వెళ్ళిపోయారు.

భారతమాత విక్క శల్యావశిష్టమైనా, పోయినంతమంది పోగా మిగిలిన తన బిడ్డలను తడిమి చూచుకుని కన్నీరు గార్చింది. ఆనందభాష్పాలు రాల్చింది.

సభ్యుడు కోలుకుని, వెతుక్కుంటూ వచ్చి చూస్తే, తనను బోల్తా కొట్టించిన లీడరు అస్త్ర సన్యాసం చేసి, వేరుకుంపటి పెట్టు కున్నది. సభ్యులనెక్కడ దాచావో చెప్పమని సున్నంలోకి యెముక ల్లేకుండా చితక్కొట్టారుట కార్చిచ్చు రేగిపోతున్నప్పుడు. అవన్నీ అతికించుకుంటూ ఒక ఆశ్రమంలో వున్నది.

యే పార్టీ సభ్యుడైనా, సుడిగుండంలో పడినా, రక్తంలో అసలు గుణం అలాగే వుంటుంది. కాలు కూడతీసుకున్నాడు. ఫామిలీని వెతికి తెచ్చి రక్షణ కల్పించాడు. తాను సుడిగుండంలో పడినప్పుడు, తన స్త్రీకేం జరిగిందీ తన స్త్రీ చెపుతుంటే గుండె చెరువైంది సభ్యునికి.

"నువ్వు లేవు. మీ లీడరు గెంటేసింది. పార్టీ సభ్యత్వం గూడా వదిలేయమన్నారు వాళ్ళెవరో. వదిలేశాను. ప్రమాదమని మీవాళ్ళు రావద్దన్నారు. కాళ్ళాచేళ్ళా పడితే అర్థరాత్రి రమ్మన్నారు. యేంచేస్తానూ, గతిలేని దాన్నైనా, వీరముష్టి కెళ్ళినట్లు వెళ్తే అపుడూ నిఘాయే. యెవరు? అనడిగితే, మీవాళ్లు, తెలిసినవాళ్లు యిబ్బందిగా వుంటే వచ్చింది. అని చెప్తూ వీరముష్టి పెట్టారు. దాంతోనే పిల్లాడూ నేనూ రోజులు వెళ్లదీశాం" అన్నది తన స్త్రీ.

పార్టీ మీద అభిమానమూ చావలేదు. పార్టీ ఫిరాయించాలనే

ఐడియా తల్లో లేదు. మంచి చేసుకుంటూ నిజాయితీ చూపుతూ, ఆనెస్ట్ అనిపించుకుంటూ, పిల్లల్ని చదివిస్తున్నాడు సభ్యుడు.

అది కన్నెర్ర అయింది, సాటి సభ్యులకు.

వీడు పవర్‌ఫుల్ అవుతున్నాడే. యెలా అవుతున్నాడూ? యెవరు చూడకుండా గడ్డి మేస్తున్నాడా, ప్రత్యర్థులు గూడా వీడి చుట్టూ మూగుతూ, పరిభ్రమిస్తున్నారంటే, యేదో కుట్ర జరుగుతున్నదన్నమాట. దేహీ అనడు. మన ప్రత్యర్థులెలా గెలుస్తున్నాదీ వీడికి తెలుసు. మన వాడెందు కోడాడు? వీడే కారణం. లాలూచీ, కుమ్మక్కు. అలాటి పదాలు వాడారు గానీ యెదుటబడి యేమవలేక, గుండెలు లేక, ఫ్లిప్ చేయలేక అసూయకు లోనై, అక్కస్సు యెక్కువై బెదిరించారు.

నువ్వు నిలబడద్దు ప్రహ్లాద్! నిన్ను చంపాలని చూస్తున్నారు మన ప్రత్యర్థులు. నింద మామీద వేస్తారు, పార్టీ పటిష్ఠం చేయటం చాలులే. సంచీలున్నాయా అటకమీద డిపాజిట్‌కే పదివేలు కావాలే. నన్ను గెలిచేట్టు చేయమని ప్రత్యర్థులు నీ చేయి తడుపుతున్నారా? అని వురిమారు.

నిశ్చలంగా చూసి డిపాజిట్ కట్టేశాడు సభ్యుడు. థ్రెట్స్ వచ్చాయి, ఫోన్‌కాల్స్ వచ్చాయి ప్రహ్లాదుడికి. పాములచే కరిపిస్తున్నట్లు, యేనుగులచే తొక్కిస్తున్నట్టు, కొండమీదనించి విసిరేసినట్టు, నీళ్ళలో ముంచినట్టున్న ప్రచారానికి ప్రహ్లాదుడు.

భోజన సదుపాయం చేసిన వృద్ధమాత, కడిపెడు బిడ్డలి కన్నతల్లి భోజనం తినిపిస్తూ వార్నింగ్ యిచ్చింది.

"ప్రహ్లాదబాబూ చీకటిపడి ఒంటరిగా వెళ్ళకు. కొత్తచోట నిదర్రి తీయకు. కృష్ణపరమాత్మ అంతటివానిని దుర్యోధనుడు తాళ్ళతో కట్టచూచాడు సభలో, నీ రోజులు బాగా లేవు. నా బిడ్డ లాగా వుంటే చెప్తున్నా. అసూయ అనేది మనుషులచేత యేమైనా చేయిస్తుంది. జూలియస్ సీజర్ని పొడిచి చంపింది సెనేటర్సే. మిత్రులే. అసూయబాబూ అసూయ,"

చూసి విని వూరుకున్నాడు. "పార్టీ విరుద్ధమైన పన్లు చేయలేదే" అనుకున్నాడు,

వృద్ధమాత జోస్యం నిజమైంది, కాని మళ్ళా తల్లి కడుపు చల్లగా కొనవూపిరితో, రోడ్డుమీద మట్టిలో పడి వున్న వానిని గ్రామీణులు గుర్తించి మోసుకెళ్ళి దగ్గర్లో వున్న హాస్పటల్లో చేర్పించి బతికించమన్నారు.

"పోయినాడు లెమ్మని, మేము రావటం చూసి గుర్తుపడతారని లగెత్తారు బాబూ గూండాలు. సత్తెకాలం మనిషి బాబు."

తల్లికడుపు చల్లగా బతికాడు ప్రహ్లాదుడు.

ఇపుడు ప్రహ్లాదుడు రైతుకూలీ లోక బాంధవుడు పదవీ లేదు. హెూదా లేదు, చేతనైన సహాయం. వున్న పేరుతోనే యెవరికైనా

చేస్తాడు. యే పార్టీ సభ్యుడని గూడా గమనించడు. ఇంకా ఖర్చు కాక మిగిలివున్న మంచితనము, తెలివితేటలూ వెచ్చించి, చదువులు పూర్తి కాగానే పిల్లలకు పెళ్ళిళ్లు చేసి, వుద్యోగాల్లో వుండగా చూసి చేతులు దులుపుకుని నిశ్వసించాడు.

ఒంటరిగా వున్నప్పుడు దూరానికి చూస్తూ నవ్వు మొహం పెడ్తాడు ప్రహ్లాదుడు

బోల్తా పడ్డానే. మిధ్యా ప్రపంచం, బాధ్యత లుండవని నమ్మించిన లీడర్, నేను అదృశ్యం కాగానే నా ధర్మపత్నిని గాలి లోకి వదిలేసింది బెలూన్ని వదిలినట్టు. పార్టీకి దాని బాధ్యతలు తప్పాయి పార్టీమనిషి కాదన్నారు. బతికి వచ్చాను. నాకు తప్ప లేదు. చేసిన సేవకూ, మేళ్లకు, సభ్యత్వం పెంచినందుకు ప్రతి ఫలంగా, దారి కాచి చంపాలని చూశారు. పార్టీ గూడా బోల్తా కొట్టించింది, యే పార్టీ మానిఫెస్టో గూడా దారి కాచి చంపమని పేర్కొనటం లేదు. అన్నీ ఒకటేనేమో. యెన్ని తిట్లు! యెన్ని శాపనార్థాలు, యెన్ని బెదిరింపులు! బతికి వున్నా గనక విచిత్ర ప్రపంచం అర్థమైంది. పోతే యెలా అర్థమవుతుంది? అనుకుంటాడు.

— ౦ —